

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 11-06-2025 | సంపుటి - 24 | సంచిక - 40 | రూ : 4 | పేజీలు: 8





## వెయ్యి మంది బాలురు..
# 907 మందే బాలికలు

- 2022లో తెలంగాణలో అత్యంత తక్కువ నిష్పత్తి నమోదు
- దేశంలో బాలురు 52.4%, బాలికలు 47.6 శాతం
- జనన, మరణాలపై కేంద్రం నివేదిక
- నికరంగా 1.67 కోట్లు పెరిగిన దేశ

## సమూల మార్పులా..
# కొత్తవారికే పరిమితమా?



- శాఖల కేటాయింపుపై కసరత్తు
- అధిష్ఠానంతో ముఖ్యమంత్రి రేవంత్ చర్చలు
- ఖర్గే, రాహుల్ గాంధీలతో సుదీర్ఘ మంతనాలు
- ఢిల్లీకి వెళ్లిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నేడు హస్తినకు భట్టి విక్రమార్క!

2లో

## నేడు జస్టిస్ ఘోష్ కమిషన్ ముందుకు కేసీఆర్

- ఉదయం 11:30 గంటలకు విచారణ ప్రారంభం
- ఆయనతోపాటు పలువురు ముఖ్యనేతలు వెళ్లే అవకాశం

**జూన్ 10, హైదరాబాద్:** కాళేశ్వరంపై విచారణ తుది దశకు చేరుకుంటోంది. ఇన్నాళ్లూ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవలే మాజీ మంత్రులనూ విచారించింది. బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఉదయం 11:30 గంటలకు ఈ విచారణ ప్రారంభంకానుంది.

తరువాయి 2లో





## రేషన్ లబ్ధిదారులు
# 3.11 కోట్ల మంది

**జూన్ 10, హైదరాబాద్:** రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారుల సంఖ్య మూడు కోట్లు దాటింది. కొత్తవారికి మంజూరు చేయడంతోపాటు.. ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను చేరుస్తున్న నేపథ్యంలో మే నెలాఖరు నాటికి లబ్ధిదారుల సంఖ్య 3,11,28,921కి చేరుకుంది.

**మీసేవ, కులగణన ద్వారా దరఖాస్తులు..**

ఈ సంవత్సరం జనవరి 26వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ మొదలైంది. ఇదే సమయంలో పాత కార్డుల్లో కొత్త పేర్ల నమోదుకూ అవకాశం కల్పించాలని పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాలు జారీచేసింది. అందుకు అనుగుణంగా మీ సేవతోపాటు కులగణన ద్వారానూ దరఖాస్తులు అందాయి. ఆయా దరఖాస్తులను పరిశీలిస్తూ విడతల వారీగా..జనవరి 26, ఫిబ్రవరి 28, ఏప్రిల్ 24, మే నెల 23 తేదీల్లో నాలుగు విడతల్లో కొత్తగా 2,03,156 కార్డులు మంజూరుచేశారు. అలాగే తొమ్మిది విడతల్లో పాత కార్డుల్లో కొత్త సభ్యులుగా 29,81,356 మంది పేర్లను నమోదుచేశారు. రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని, ఇంకా పరిశీలించాల్సిన

తరువాయి 2లో

- నాలుగు విడతల్లో కొత్తగా 2.03 లక్షల కార్డుల మంజూరు
- పాత వాటిలో అదనంగా 29.81 లక్షల మంది సభ్యుల నమోదు
- మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా పత్రాల పంపిణీ యోచన



## పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నా..
# 100 శాతం మార్పు తీసుకురండి

- మహిళలపై నేరాలకు పాల్పడాలంటే భయపడాలి
- అనంతపురం ఘటనలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశం

**జూన్ 10, అమరావతి:** 'మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవనే హెచ్చరిక పంపేలా పోలీసులు వ్యవహరించాలి. నేరం చేయాలనే ఆలోచన రావటానికే భయపడే పరిస్థితి తీసుకురావాలి. రాష్ట్రంలో ఏ మూల మహిళలపై నేరాలు జరిగినా కఠినంగా వ్యవహరించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు నేరగాళ్లపై నియంత్రణ లేకుండా పోయిందని.. గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి చట్టమంటే లెక్కలేనితనంతో వ్యవహరించటానికి కొందరు అలవాటుపడ్డారని పేర్కొన్నారు. ఇప్పటికీ అదే బాటలో నడుస్తున్నారన్నారు. ఇలాంటి గంజాయి మూకలకు, నేరగాళ్లకు అడ్డుకట్ట వేయాలని, ఈ విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నానని చెప్పారు. 100 శాతం మార్పు తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతపురంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని హత్య, శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మైనర్

తరువాయి 2లో

# గుండె ముప్పు.. ఏఐతో గుర్తింపు

- సడన్ కార్డియాక్ అరెస్టుపై అంతర్జాతీయ పరిశోధన
- హోల్టర్ టెస్ట్‌తో 14 రోజులపాటు ఈసీజీల నమోదు
- భారత్ సహా ఆరు దేశాల్లో ఐదేళ్లపాటు 2.4 లక్షల ఈసీజీల పరిశీలన
- 10-15 రోజుల ముందే ప్రమాదకర సంకేతాలను పసిగట్టిన కృత్రిమ మేధ
- ఆకస్మిక మరణాల నివారణకు అవకాశాలు మెరుగు

2లో





## ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సిద్ధం.. ఏర్పాట్లు షురూ!

అమెరికా అణుఒప్పందంపై చర్చించేందుకు మరోసారి సమావేశం కాబోతున్న తరుణంలో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కీలక ప్రదేశాలకు ఆయుధాల తరలింపు పనులు చురుగ్గా సాగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అక్కడి మీడియాలో

తరువాయి 2లో

# పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నా.. 100 శాతం మార్పు తీసుకురండి

(మొదటిపేజీ తరువాయి)

బాలికపై అత్యాచార ఘటనల పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు.. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, నిఘా విభాగాధిపతి మహేష్ చంద్ర లడ్డా, సీఎంవో అధికారులతో మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేశారు. ఈ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సత్వరమే దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రాలు దాఖలు చేయాలని నిర్దేశించారు. బలమైన ఆధారాల్ని న్యాయస్థానాలకు సమర్పించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత వేగంగా ట్రయల్ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. తొలుత డీజీపీ మాట్లాడుతూ.. ఈ రెండు కేసుల్లో దర్యాప్తు పురోగతి, ఇప్పటివరకూ తీసుకున్న చర్యల గురించి వివరించారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థినిని పరిచయస్థుడే హత్య చేశాడని, రామగిరి మండలంలో బాలికపై కొంతమంది చాలాకాలంగా అత్యాచారానికి పాల్పడుతున్నట్లు తేలిందని డీజీపీ చెప్పారు.

# నేడు జస్టిస్ ఘోష్ కమిషన్ ముందుకు కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సీపేజీ నేపథ్యంలో గత ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి బ్యారేజీల నిర్మాణ ఇంజినీర్లు, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, నీటిపారుదల, ఆర్థిక శాఖల అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించడం, వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని క్రాస్ ఎగ్జామినేషన్‌ను సైతం పూర్తిచేసింది. ఈ నెల 6న ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్, 9న నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు విచారణకు హాజరయ్యారు. ఇప్పటివరకు మీడియా, కమిషన్‌లోని ఇంజినీర్ల సమక్షంలోనే విచారణ జరిగింది. నేడు కేసీఆర్ విషయంలో ఇదే పద్ధతిని అనుసరిస్తారా లేక కేవలం కమిషన్ అధికారుల వరకే పరిమితమై ఇన్‌కెమెరా విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారా అన్నది చూడాల్సి ఉంది.

**పార్టీ నేతల చర్చలు**

కేసీఆర్‌తో భారాస నేతలు మంగళవారం మరోసారి సమావేశమై పలు అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. హరీశ్‌రావుతో కమిషన్ చర్చించిన విషయాలతోపాటు అదనంగా అడిగే అవకాశం ఉన్న అంశాల గురించి కూడా లోతుగా చర్చించినట్లు సమాచారం. బుధవారం కేసీఆర్ వెంట పార్టీ ముఖ్యనాయకులు కూడా రానున్నారు. విచారణ సమయంలో పరిమితంగా కొందరిని అనుమతించే అవకాశం ఉన్నందున తొమ్మిది మందితో కూడిన జాబితాను ముందుగానే ఇచ్చినట్లు తెలిసింది. ఇందులో హరీశ్‌రావుతోపాటు మధుసూదనాచారి, ప్రశాంత్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పద్మారావుగౌడ్, బండారి లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు ఉన్నట్లు వినికిడి.

# ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సిద్ధం.. ఏర్పాట్లు షురూ!

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం జరుగుతోంది. గత ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా విదేశీ వ్యవహారాల నిపుణులు మేరీల్యాండ్‌లోని క్యాంప్ డేవిడ్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఇరాన్ అంశంలో అమెరికా వ్యూహం గురించి గంటలపాటు చర్చించారు. ఈ క్రమంలోనే ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఫోన్ చేసి దాదాపు 40 నిమిషాల పాటు మాట్లాడారు. ఆ తర్వాత నెతన్యాహు రక్షణశాఖ ఉన్నతాధికారులు, కీలక మంత్రులతో అత్యవసర భద్రత సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని అణుకేంద్రాలు, అణుఆయుధాల ఉత్పత్తిలో ఇరాన్ వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. మరోవైపు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుకులకు సిద్ధమవుతున్నట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా పదేపదే చెబుతున్నాయి. అయితే, దాడుల తీవ్రత ఎలా ఉంటుంది? ఎప్పుడు దాడులు చేసే అవకాశం ఉంది? దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇప్పటికే తుది నిర్ణయం తీసుకుందా? అనే వివరాలు మాత్రం వెల్లడించలేదు.

**'అణు బూచి'ని చూపిస్తున్న ఇరాన్**

ఒకవేళ ఇజ్రాయెల్ దాడికి పాల్పడితే దీటుగా బదులిచ్చేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రతిచర్యగా ఇజ్రాయెల్‌పై అణు ఆయుధాలను ప్రయోగించే అవకాశముందని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ డైరెక్టర్ రఫేల్ గ్రోసీ ఇజ్రాయెల్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. '' ఇరాన్ అణుస్థావరాలపై దాడి జరిగితే ఇరానియన్లు చూస్తూ ఊరుకోరు. న్యూక్లియర్ ఆయుధాన్ని ఇజ్రాయెల్‌పై ప్రయోగించే అవకాశం ఉంది. దాని తీవ్రత ఊహకందని విధంగా ఉంటుంది. అంతేకాకుండా ఇరాన్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. అణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి వైదొలగొచ్చు'' అని గ్రోసీ పేర్కొన్నారు.

**ఈ సారీ 'నో'!**

ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి అడుగులు వేస్తోంది. దీనిపై ఇటీవల ఒమన్‌లో ఉన్నతస్థాయి చర్చలు కూడా జరిగాయి. అయితే, అమెరికా ప్రతిపాదనను ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ విమర్శించారు. యూఎస్ ప్రతిపాదన తమ చర్యలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని వ్యాఖ్యానించారు. న్యూక్లియర్ డీల్ కుదరకపోతే సైనిక చర్యలకు దిగుతామంటూ ట్రంప్ హెచ్చరికలు కూడా చేశారు. మరోసారి అమెరికా చర్చలకు సిద్ధమవుతున్న క్రమంలో ఈసారి కూడా 'నో' చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అన్ని వైపుల నుంచి ఆ దేశంపై ఒత్తిడి పెంచేందుకే ఇజ్రాయెల్‌ను అమెరికా పురిగొలిపినట్లు తెలుస్తోంది

# రేషన్ లబ్ధిదారులు 3.11 కోట్ల మంది

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులు పెద్దసంఖ్యలోనే ఉన్నాయని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా..కొత్తగా మంజూరైన వారికి స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం. ఆ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనున్నట్లు తెలిసింది.

**కుటుంబాల లెక్కలివీ..**

* కులగణన సర్వే మేరకు కుటుంబాల సంఖ్య: 1,15,71,457
* పాతవి, కొత్తవి కలిపి మొత్తం ఆహార భద్రత కార్డులు: 91,98,438
* రేషన్‌కార్డులు ఉన్న కుటుంబాల శాతం: 79.49

**2025 జనవరి 1 నాటికి పాత కార్డుల వివరాలిలా..**

| కార్డుల రకం | కార్డుల సంఖ్య | లబ్ధిదారులు |
|---|---|---|
| జాతీయ ఆహార భద్రత కార్డులు | 54,66,844 | 1,91,69,600 |
| రాష్ట్ర ఆహార భద్రత కార్డులు | 35,28,438 | 89,77,965 |
| మొత్తం | 89,95,282 | 2,81,47,565 |

# గుండె ముప్పు.. ఏఐతో గుర్తింపు...

నడి వయసుకు ముందే గుండె అలసిపోతోంది. కొందరు ఆడుతూ... పాడుతూ.. కసరత్తులు చేస్తూ.. పనులు చేసుకుంటూ.. ఉన్నట్టుండి కుప్పకూలుతున్నారు. ఆసుపత్రికి తరలించేలోగానే మృత్యువాత పడుతున్నారు. వైద్య నిపుణులు దీన్ని 'సడన్ కార్డియాక్ అరెస్ట్'గా చెబుతుంటారు. కనీసం చికిత్స అందించే అవకాశమైనా ఇవ్వకుండా ప్రాణాలు హరించే ఈ ముప్పు నుంచి తప్పించుకోలేమా? ముందస్తుగా గుర్తించలేమా? ఈ ప్రశ్నలకు ఆరు దేశాల్లో నిర్వహించిన ఓ అధ్యయనం సానుకూల సమాధానమిస్తోంది. ఇలాంటి ఆకస్మిక మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటి... గుండె లయ తప్పడం(అరిథ్మియా). దీన్ని 'కృత్రిమ మేధ(ఏఐ)' సాయంతో ముందస్తుగా గుర్తించవచ్చని ఈ అధ్యయనపత్రం స్పష్టంచేసింది. అమెరికా, భారత్, బ్రిటన్, ఫ్రాన్స్, చెక్ రిపబ్లిక్, దక్షిణాఫ్రికాలలో 2019 జనవరి 1 నుంచి 2024 జనవరి 1 వరకు అధ్యయనం చేశారు. హోల్టర్ టెస్ట్ ద్వారా 18 ఏళ్లు పైబడిన వారికి 14 రోజులపాటు తీసిన 2,47,254 ఈసీజీలను ఏఐతో అనుసంధానం చేసి... ప్యారిస్ సిటీ యూనివర్సిటీ, హార్వర్డ్ మెడికల్ స్కూల్, హైదరాబాద్‌కు చెందిన మెడికవర్ హాస్పిటల్స్ ప్రతినిధులు సంయుక్తంగా విశ్లేషించారు. ప్రమాదకర గుండెపోటు సంకేతాలను 1015 రోజుల ముందుగానే, 80% కచ్చితత్వంతో ఏఐ పసిగట్టినట్లు వెల్లడించారు. ఈ అంశాలతో అధ్యయనపత్రం 'యూరోపియన్ హార్ట్ జర్నల్'లో తాజాగా ప్రచురితమైంది. అధ్యయనకర్తల్లో ఒకరైన కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ డాక్టర్ కుమార్ నారాయణన్ మరిన్ని వివరాలను 'ఈనాడు'కు వెల్లడించారు.

నగర జీవనంలో నిత్యం కాలంతోపాటు పరుగు పెడుతున్నారు. శారీరక శ్రమ తగ్గిపోయింది. జంక్‌ఫుడ్ పెరిగిపోయింది. ఒత్తిడి అధికమైంది. ఫలితంగా 30 ఏళ్లలోపే మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం వంటివి చుట్టుముడుతున్నాయి. గ్రామాల్లోనూ గతంతో పోల్చితే శారీరక శ్రమ తగ్గి, ఆహారపు అలవాట్లలో గణనీయ మార్పులు వచ్చాయి. ఈ ప్రభావం జీవనశైలి వ్యాధుల రూపంలో వెన్నాడుతోంది. మొత్తం గుండెపోటు బాధితుల్లో సుమారు 30% మంది యువత ఉంటుండగా... వీరిలోనూ సుమారు 50% మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటున్నారు. సడన్ కార్డియాక్ అరెస్టు జరిగినప్పుడు.. రియాక్షన్ టైమ్ అంతగా ఉండదు. ఎక్కువ సందర్భాల్లో అంబులెన్సు వచ్చే సరికే చనిపోతుంటారు.

**హృదయ విద్యుత్ వ్యవస్థలో కుదుపు...**

సాధారణంగా మన గుండె నిమిషానికి 60100 సార్లు వరకు కొట్టుకుంటుంది. వ్యాయామం చేసినప్పుడు 170180 వరకు వెళ్లొచ్చు. వ్యాయామం ఆపేయగానే మళ్లీ సాధారణ స్థితికి వస్తుంది. 'అరిథ్మియా' అనేది గుండెలోని విద్యుత్ వ్యవస్థలో అకస్మాత్తుగా వచ్చే కుదుపు లాంటిది. ఇది జరిగినప్పుడు... కొందరిలో గుండె అతివేగంగా కొట్టుకుంటే, మరికొందరిలో తక్కువగా స్పందిస్తుంది. కొందరిలో రెండూ ఉండొచ్చు. ఇలా జరగడానికి గుండె రక్తనాళాల్లో పూడికలు ఏర్పడడం ప్రధాన కారణం. గుండె కింది గదుల్లో వేగం పెరిగినప్పుడు వెంట్రిక్యులర్ టాకీకార్డియా(వీటీ)కు దారితీస్తుంది. 'వీటీ'లో గుండె నిమిషానికి 300సార్లకు పైగా కూడా కొట్టుకోవచ్చు. ఇది సడన్ కార్డియాక్ అరెస్ట్, సడన్ కార్డియాక్ డెత్‌లకు దారితీయొచ్చు. గుండె లయలో లోపాలను నివారించడానికి మూడు దశాబ్దాలుగా ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీఫిబ్రిలేటర్(ఐసీడీ)ను వినియోగిస్తున్నా... ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సడన్ కార్డియాక్ డెత్‌తో ఏటా 50 లక్షల మంది మృతి చెందుతున్నారు. ఈ మరణాల నివారణకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నా... ఫలితాలు అత్యధిక సందర్భాల్లో నిరాశాజనకంగానే ఉంటున్నాయి. అయితే అంతర్జాతీయంగా జరిగిన ప్రస్తుత పరిశోధన కొత్త ఆశలను చిగురింపజేస్తోంది.

**గుండెకు పరికరాన్ని అనుసంధానం చేసి...**

ఆరు దేశాల్లో పరిశోధనలో పాల్గొన్న వారికి రెండు వారాలపాటు 'హోల్టర్ టెస్ట్' నిర్వహించారు. హోల్టర్ టెస్ట్ అంటే.. ఒక పరికరాన్ని గుండెకు అనుసంధానం చేసి, శరీరం పైభాగంలో అమర్చుతారు. ఇది రోజులో గుండె కొట్టుకునే విధానాన్ని నమోదు చేస్తుంది. సాధారణంగా ఈసీజీ చేస్తే 1520 సెకన్లలో గుండె పనితీరును అంచనా వేసి చెబుతుంది. హోల్టర్ పరీక్షలో 14 రోజులపాటు ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడూ రికార్డు చేసుకుంటుంది. అలా భారీగా సేకరించిన హోల్టర్ ఈసీజీలను ఏఐకి అనుసంధానించి 'డీప్ లెర్నింగ్ బేస్ట్' విధానంలో విశ్లేషించారు. ఈ విధానం... సడన్ కార్డియాక్ అరెస్టుకు కారణమయ్యే 'వెంట్రిక్యులర్ టాకీకార్డియా(వీటీ)'కు సంబంధించిన ప్రమాదకరమైన సంకేతాలను 80% కంటే ఎక్కువ కచ్చితత్వంతో అంచనా వేసింది.

* **ముందుగా లక్షణాలేమైనా గుర్తించవచ్చా?**

అందరిలో కాకపోయినా.. 50 60% మందిలో కొద్దిరోజుల ముందే ముందస్తు ముప్పు సంకేతాలు వస్తుంటాయి. గుండెలో నొప్పి లేదా ఛాతీ నొప్పి, ఆయాసం, గుండె దడ, కళ్లు తిరగడం, బాగా నీరసించడం... వంటివి కనిపిస్తుంటాయి. సాధారణంగా ఇవి తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యుల వద్దకు వెళ్తారు. అయితే కొన్ని సందర్భాల్లో ఇవి స్వల్ప నుంచి మధ్యస్థంగా ఉంటుండంతో.. వీటిని పట్టించుకోకుండా.. ఇవి సాధారణ లక్షణాలే అని వదిలేస్తున్నారు. తద్వారా ఉన్నట్టుండి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు.

* **ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు**

ఇప్పటికే గుండెజబ్బుతో బాధపడుతున్నవారు, మధుమేహులు, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ బాధితులు, ఊబకాయులు, ధూమపానం అలవాటున్నవారు, నిత్యం ఒత్తిడిని ఎదుర్కొంటున్నవారు, వ్యాయామానికి దూరంగా ఉంటున్నవారు, కుటుంబంలో ఎవరైనా గుండెజబ్బుతో చనిపోయి ఉంటే.. అటువంటి వారు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. రోజూ కనీసం 40 నిమిషాలు శారీరక శ్రమ చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్ తగ్గించాలి. ధూమపానం మానేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. రోజులో కనీసం 68 గంటలు నిద్రపోవాలి.

# సమూల మార్పులా.. కొత్తవారికే పరిమితమా?

హైదరాబాద్, దిల్లీ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిన్నర తర్వాత మంత్రివర్గ విస్తరణ చేపట్టగా.. ఇప్పుడు అందరి దృష్టి శాఖల కేటాయింపుపైకే మళ్లింది. మంత్రుల శాఖల్లో సమూల మార్పులు జరుగుతాయా లేదా విస్తరణలో కొత్తగా పదవులు దక్కించుకున్న వారికి శాఖల కేటాయింపుల వరకే ప్రక్రియ పరిమితం అవుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకరిద్దరు మంత్రుల విషయంలో పార్టీ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని, వారి శాఖల్లో మార్పులు జరగవచ్చనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. అయితే, మార్పులు జరిగితే ఒకరిద్దరికి పరిమితం కాదని, సమూలంగా జరిగే అవకాశం ఉంటుందని, లేదా విస్తరణలో అవకాశం పొందినవారికి శాఖలు కేటాయించడం వరకే పరిమితం కావొచ్చని మరికొందరు నాయకులు పేర్కొంటున్నారు. సోమవారం దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. మంగళవారం ఉదయం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతోనూ చర్చలు జరిపారు. అనంతరం అగ్రనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేలతో రేవంత్‌రెడ్డి సుదీర్ఘ మంతనాలు జరిపినట్లు తెలిసింది. దాదాపు రెండు గంటల చర్చల అనంతరం కూడా శాఖలపై స్పష్టత రాలేదని సమాచారం. కేసీ వేణుగోపాల్, ఖర్గేలతో జరిగిన చర్చల్లో ఒకరిద్దరు మంత్రుల పనితీరుపై లోతుగా చర్చ జరిగినట్లు తెలిసింది. సీఎం ఇంకా దిల్లీలోనే ఉన్నారు. శాఖల కేటాయింపుపై మరింత కసరత్తు కోసం అందుబాటులో ఉండాలని ఆయనను అధిష్ఠానం పెద్దలు కోరి ఉండొచ్చని పార్టీ నాయకులు చెబుతున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం రాత్రి దిల్లీ వెళ్లారు. అక్కడ వేగంగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయనే వెళ్లారా లేక అధిష్ఠానం పిలిచిందా అన్నదానిపై స్పష్టత లేదు. ఉప ముఖ్యమంత్రి భట్టి కూడా బుధవారం దిల్లీ వెళ్లనున్నట్లు తెలిసింది.

**ఇటు బుజ్జగింపులు.. అటు చర్చలు**

మంత్రివర్గ విస్తరణలో జి.వివేక్, వాకిటి శ్రీహరి, లక్ష్మణ్‌కుమార్‌లకు చోటు లభించగా... అవకాశం కో సం ఎదురుచూసినా రానివారు అసంతృప్తితో ఉన్నారు. ఒకవైపు వీరిని బుజ్జగించే పనిలో నిమగ్నమై ఉండగా, ఇప్పుడు శాఖల కేటాయింపుపై అధిష్ఠానం విస్తృతంగా చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇద్దరు కీలక మంత్రుల వద్ద రెండేసి ముఖ్య శాఖలు ఉన్నాయి. ఓ మంత్రి నుంచి ప్రధానమైన ఓ శాఖను మార్చి.. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న ఓ శాఖను ఆయనకు ఇవ్వొచ్చని ప్రచారం ఉంది. అయితే, ఆయన పనితీరుపై అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. జనవరిలో మంత్రులతో నిర్వహించిన సమావేశంలోనూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. మరో సీనియర్ మంత్రి వద్ద ఉన్న రెండు శాఖల్లో ఒక దాన్ని ఇంకో మంత్రికి ఇచ్చి... ఆయన వద్ద ఉన్న శాఖను ఈయనకు ఇచ్చే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారంలో ఉంది. అయితే మంత్రుల శాఖలను మార్చడానికి నిర్ణయిస్తే సమూల మార్పులకు దారితీస్తుందని, ఇది కొత్త సమస్యలను సృష్టించే అవకాశం ఉందని కొందరు పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీలైనంత తక్కువ మార్పులు చేయడం లేదా కొత్తవారికి శాఖలు కేటాయించడం వరకే పరిమితం కావాలని సీఎం సూచించినట్లు ప్రచారం జరుగుతున్నా... దీనిపై స్పష్టత లేదు. కొత్త మంత్రులకు కూడా ముఖ్యమైన శాఖలు కేటాయించాలనే అభిప్రాయంతో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కనివారితో పాటు ఓ మంత్రి సైతం అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారంలో ఉంది. తాజాగా మంత్రివర్గంలో చేరిన ఓ నాయకుడు తనకు కీలక శాఖ అప్పగించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది.

**ముఖ్యమంత్రిని కలిసిన వివేక్**

మంత్రివర్గంలో కొత్తగా చేరిన జి.వివేక్ దిల్లీలో కేసీ వేణుగోపాల్, ఖర్గేలతో పాటు రేవంత్‌రెడ్డిని కలిశారు. వివేక్ వెంట ఆయన కుమారుడు, పెద్దపల్లి ఎంపీ వంశీ, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ ఉన్నారు. అనంతరం వివేక్ విలేకర్లతో మాట్లాడుతూ మంత్రులకు శాఖల కేటాయింపుపై అధిష్ఠానంతో ముఖ్యమంత్రి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఒకటి రెండు రోజుల్లో ఇది పూర్తవుతుందన్నారు. ఎవరికి ఏ శాఖ కేటాయించాలనేది ముఖ్యమంత్రి అధికార పరిధిలోని అంశమని అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకత్వం సామాజిక న్యాయం పాటిస్తూ ఎస్సీ, బీసీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించిందన్నారు. పేదల కోసం కాంగ్రెస్ ఎలా పనిచేస్తోందో ప్రజలకు తెలియజేయాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే తనకు సూచించారని ఆయన తెలిపారు.

# నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి




* **భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**

హైదరాబాద్: రైతులను మోసం చేస్తున్న నకిలీ విత్తన కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేలా కంపెనీలతో చర్చించి తగిన న్యాయం చేయాలని కోరారు. సీడ్ కంపెనీల అక్రమాలతో మోసపోయిన గద్వాల జిల్లా రైతులు స్థానిక భారాస నేత విజయ్‌కుమార్ కురువ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నందినగర్‌లో మంగళవారం కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సీడ్ కంపెనీలు చేసిన మోసంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆవేదనను విన్న కేటీఆర్.. గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సీడ్ కంపెనీలతో చర్చలు నిర్వహించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.





## మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా
# జర్నలిస్టులు అప్డేట్ కావడానికి శిక్షణ తరగతులు ఉపయోగపడతాయి

*** మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమని తాము అప్డేట్ చేసుకుంటూ తమ వృత్తిలో రాణించేందుకు పాత్రికేయులకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లి లోని మీడియా అకాడమీలో నిర్వహిస్తున్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పాత్రికేయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు లతో కలిసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సామాజిక





బాధ్యత విలువలతో కూడిన వృత్తి జర్నలిజమని నిజాయితీ పారదర్శకతతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో జర్నలిస్టులు విధులు నిర్వహించాలని అన్నారు. నూతన టెక్నాలజీని వినియోగించుకుని పాఠకులను ఆకర్షించే విధంగా వార్తలను సేకరించాలని అన్నారు. పత్రికా రంగంలో వచ్చిన నూతన చట్టాలపై చైర్మన్ పాత్రికేయులకు అవగాహన కల్పించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకొని తమ వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని సమాజం పట్ల తమ వంతు బాధ్యతను పాత్రికేయులు నిర్వర్తించాలని అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అభివృద్ధి పురోగతిపై అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రస్తుతము 70శాతం జిహెచ్ఎంసి పరిధిలోకి మారడం జరిగిందని అన్నారు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళు, ధాన్యం కొనుగోలు మూడు నెలలకు సరిపడా సన్న బియ్యం పంపిణీ వంటి ప్రభుత్వ పథకాలు కొనసాగుతున్నాయని పథకాల పురోగతిపై వివరణ ఇచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులకు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ తరగతులకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శిక్షణ తరగతులను బోధించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా లోని సీనియర్ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## ఇల్లందు పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పదోవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రం సింగరేణి ఉన్నత పాఠశాల ఇల్లెందును జిల్లా ఫ్లయింగ్ స్కాడ్ సభ్యులు కొత్తగూడెం యం ఇ ఓ డాక్టర్ ప్రభుదయాల్ మంగళవారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసారి సైన్సు, గణితం లోనే అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు గమనించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ప్రారంభం నుండే అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా ఇంగ్లీషు, గణితం, సైన్సు సబ్జెక్టుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు

## బిజెపి సీనియర్ కార్యకర్త కన్నుమూత

*** పార్థివ దేహానికి నివాళి అర్పించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ కార్యకర్త గున్నాల రమేష్ గౌడ్ మంగళవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్ భౌతిక కాయాన్ని సందర్శించి, పార్థివ దేహంపై బిజెపి జెండాను కప్పి నివాళి అర్పించారు. రమేష్ గౌడ్ తల్లిదండ్రులు భూమాగౌడ్ లక్ష్మి, సోదరుడు వెంకటస్వామి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట బిజెపి మండల అధ్యక్షుడు సౌల క్రాంతికుమార్, ఎల్లారెడ్డిపేట మాజీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బాధ నరేష్, శ్రీనివాస రావు, కోల కృష్ణ, మహేందర్, కొంపల్లి రాజేందర్, గోపాల్ రాజిరెడ్డి తదితరులున్నారు.

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా ఎర్రగోకుల వినోద్



రాజాపేట ,ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శిగా రాజపేటకు చెందిన మాజీ పట్టణ శాఖ అధ్యక్షులు ఎర్రగోకుల వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రాజపేటలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ ఖరారు చేశారు.. తన ఎన్నికకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని వినోద్ అన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరు అశోక్ గౌడ్, ఇతర పార్టీల నాయకులు జర్నలిస్టులు వినోద్ ను అభినందించారు.

# జూన్ 12 న పండగ వాతావరణంలో బడులు ప్రారంభించాలి

*** అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ విద్యా చందన..**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జూన్ 12 న పండగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించాలని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ విద్యా చందన అన్నారు. మంగళవారం జిల్లా డిఆర్డిఏ కార్యాలయం నుండి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని మండలాల మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులు, ఏ.పి.ఎం లు పాల్గొన్నారు.ఈ సమావేశలో జిల్లా అడిషనల్ కలెక్టర్, లోకల్ బాడీ, విద్యా చందన మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలో పునః ప్రారంభం కాబోతున్న శుభ సందర్భంగా, అన్ని పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది, మామిడి తోరణాలతో అలంకరణ చేసి, పండగ వాతావరణం లో విద్యార్థులను ఆహ్వానించాలని అన్నారు. పాఠశాల ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందవలసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు పాఠశాలకు చేరేలా చూసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత విభాగాలతో సంప్రదించి ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు.బడిబాట షెడ్యూల్ ప్రకారం ఇంటింటికి వెళ్లి సర్వే చేసి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత యూనిఫామ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోటు పుస్తకాలు, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, డిజిటల్ విధానంలో తరగతుల బోధన, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ద్వారా నాణ్యమైన విద్య బోధన మౌలిక వసతులతో కూడిన భవనాలు వంటి సదుపాయాలగూర్చి వివరించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. నీరు నిలువ ఉండే ప్రాంతాన్ని బట్టి ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశం లో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి మాట్లాడుతూ పాఠశాలలు 12వ తేదీన ప్రారంభం అవుతున్న సందర్భంగా, పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు పొదలు శుభ్రం చేసి విషపురుగులు లేకుండా పాఠశాలలోని తరగతి గదులు శుభ్రంగా కడిగి సిద్ధం చేసుకోవాలన్నారు. జూన్ 12న పండుగ వాతావరణం లో విద్యార్థులను, తల్లిదండ్రులను, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులను, స్థానిక రిటైర్డ్ ఉద్యోగులను ఆహ్వానించి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి 202526 వ విద్యా సంవత్సరమునకు సంబంధించిన పాఠశాల విద్యా ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. అంగన్ వాడీ టీచర్ల సహకారంతో, గ్రామంలోని 5సం. రాలు నిండిన ప్రతి పిల్లవాడు కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా 100% నమోదుకు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో బడి బయట పిల్లలు ఎవరైనా ఉంటే వారిని వెంటనే పాఠశాలల్లో చేర్పించి బడిబయట పిల్లలు లేని గ్రామంగా చూసుకోవాలన్నారు. కలెక్టర్ సూచనల మేరకు అన్ని పాఠశాలల్లో ఆరు రకాల చెట్లు, ఐదు రకాల ఔషధ మొక్కలు పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమానికి సంబంధించి రోజువారి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి, ప్రతిరోజు బడిబాట రిపోర్టును , యూనిఫారం వివరాలను ఐ.ఎస్.ఎం.ఎస్ (స్కూల్ ఎడ్యుకేషన్ యాప్) నందు ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాలన్నారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (వి ఈ ఆర్) ను ప్రధానోపాధ్యాయులు అప్డేట్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డి ఆర్ డి ఓ నీలేష్, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ లు యస్. కె. సైదులు, ఎన్. సతీష్ కుమార్, డిపిఎం లు రంగారావు, నాగజ్యోతి,ఎంపీడీఓ, ఎంఈఓ ఏ పి ఎం లు పాల్గొన్నారు.

## ప్రజాసేవలోనే కొనసాగుతా : సట్టు తిరుమలేష్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట పట్టణ మండల అభివృద్ధి సంక్షేమం కోసం 25 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ వస్తున్నానని జీవితాంతం ప్రజా సేవలోనే కొనసాగుతానని రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు. మంగళవారం సట్టు తిరుమలేష్ కు బిఆర్ఎస్ పార్టీ పక్షాన రాజపేట మండల నాయకులు,రాష్ట్ర నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజపేట జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి జన్మదిన వేడుకలు జరిపారు. కేక్ కట్ చేసి పిఠాయి పంపిణీ చేశారు. శాలువాలో పూలమాలలు చేనేత వస్త్రాలు పుష్పగుచ్ఛాలు ప్రత్యేక బహుమతులతో తిరుమలేష్ ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు ఎర్ర గోకుల జశ్వంత్, మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్ గౌడ్, మండల పార్టీ సెక్రటరీ జనరల్ పాల సొసైటీ చైర్మన్ సంధిల భాస్కరు గౌడ్, గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, రాజపేట పట్టణ శాఖ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెడిద వీరేశం, దొంకెన మహేందర్ గౌడ్, రామిండ్ల నరేందర్, నర్సిరెడ్డి, ఏమ్మా భాస్కర్, గంధమల్ల సురేష్, ఠాగూర్ భగత్ సింగ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు మొలుగు సోమలింగం, జానకి రాములు, కూతురు లింగం, గజ్జల రాజు, గుర్రం బాబు, చెరుకు కనకయ్య, గుంటి రాజయ్య, వెంకటేశం, సందుల వెంకటేశం, ఎర్రగోకుల చంద్రయ్య, లక్ష్మణ్ నాయక్, గొలన రవి, రాణి, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సట్టు తిరుమలేష్ కృతజ్ఞతలు చెప్పారు.

## ఈ నెల 13 నుంచి లులు మాల్ లో లైవ్ బాక్సింగ్ పోటీలు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 13, 14, 15 వ తేదీల్లో మూడు రోజుల పాటు కూకట్ పల్లిలోని లులు మాల్.. యూఐసీతో కలిసి "లులు యూఐసీ ఫైట్ నైట్ 2" ఈ పోటీలను నిర్వహించనుందని రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరంలో మాల్ లో ఇలాంటి పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి అని, తొలి రోజు ఫేస్ ఆఫ్, రెండో రోజు కిక్ బాక్సింగ్, మూడో రోజు మువతాయ్ పోటీలు జరుగుతాయన్నారు. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు.. ఈ ఈవెంట్ లో దేశ వ్యాప్తంగా 36 మంది బాక్సర్లు పాల్గొన నున్నారని, ఆరుగురు రిఫరీలుగా వ్యవహరిస్తారన్నారు. ఈ పోటీలకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సైతం హాజరుకానున్నారని తెలిపారు. ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఎమ్మెల్సీ కవితతో పాటు హీరోలు సుమన్, నితిన్ సైతం హజరుకానున్నారని తెలిపారు. మాల్ ప్రాంగణంలోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ వెల్లడించారు. పోటీల సమయంలో అందరికీ ఉచిత ప్రవేశం ఉంటుందని ఆయన తెలిపారు. సందర్శకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ కోరారు.

## బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షునిగా బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షునిగా మున్సిపల్ పరిధి లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డిని నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదేశానుసారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంగళవారం నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆల్మాస్ పేట కిష్టయ్య, మున్సిపల్ యూత్ అధ్యక్షుడు తొర్పునూరి నర్సింహ్మ గౌడ్, నాయకులు బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, ఊడుగు మల్లేష్ గౌడ్, ముటుకుల్లోజు దయాకర్ చారి, తాడూరి పరమేష్, తొర్పునూరి మల్లేశం గౌడ్, కొయ్యడ శేఖర్ గౌడ్, సుర్కంటి రాంరెడ్డి, ఢిల్లీ శంకర్ రెడ్డి, చెవగోని మహేష్ గౌడ్, అతహర్ పాషా, మున్నా, రమణగోని రఘు, వలందాస్ సతీష్ గౌడ్, చిన్నం బాలరాజు, మెట్టు మహేశ్వర్ రెడ్డి, మహంకాళి మైసయ్య, బొంతల ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబిటాస్ గుర్తింపును రద్దు చేయాలి..

* పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ ధర్నా
* బెదిరింపులకు పాల్పడిన పాఠశాల యాజమాన్యం
* పాఠ్యపుస్తకాలను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు







చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న అంబిటస్ ప్రైవేట్ విద్యాసంస్థ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాష్, తీగుళ్ల శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని అంబిటస్ ప్రైవేట్ విద్యాసంస్థ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ప్రకాష్ తీగుళ్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్స్ అమ్ముతున్నారనే సమాచారం మేరకు పాఠశాలకు వచ్చామన్నారు. పాఠశాల లోనికి వచ్చి చూస్తే, యాజమాన్యమే స్వయంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్స్ విక్రయిస్తుండడంతో, సమాచారం వాస్తవమేనని అవగతమైందన్నారు. పాఠశాల యాజమాన్యాన్ని ఎందుకు అమ్ముతున్నారని అడగగా, తమను దబాయించారని, తమపై బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫోటోలు, వీడియోలు తీస్తూ, మీ అంతు చూస్తామంటూ ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయ బృందమంతా ఒక్కసారిగా మీదకు వచ్చి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. దీంతో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించామని, మండల విద్యాశాఖ అధికారికి సమాచారం ఇచ్చామన్నారు. విద్యాశాఖ అధికారులు వచ్చి అమ్ముతున్న పాఠ్యపుస్తకాలను సీజ్ చేశారన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని, విద్య అంగడి సరుకుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రత్యేకంగా ఫీజుల నియంత్రణ చేసేలా ప్రత్యేక చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి సాతిరి మనోజ్, మండల ఉపాధ్యక్షుడు దోనూరు శ్రావణ్, వరుణ్ మండల కమిటీ సభ్యులు చీమకండ్ల కిషోర్, జయంత్, వెంకట్, సిద్ధు, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బిఆర్ఎస్ నాయకుడు శివకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాండాల శివకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో ఉప్పల్ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పాండాల శివకుమార్ గౌడ్ చే పాల్గొని కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అభ్యునతి కోసం పని చేస్తున్న నాయకుడు శివకుమార్ గౌడ్ మరిన్ని పుట్టిన రోజు వేడుకలు జరుపుకోని ఉన్నత పదవులకు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిద పార్టీల నాయకులు, పలు కాలనీలకు చెందిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే




ప్రజాస్ఫూర్తి, కాప్రా : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కె ఎల్ రెడ్డి నగర్ , హెచ్ సి ఎల్ నగర్ కాలనీల్లో రూ. 64 లక్షలతో జరిగిన సీసీ రోడ్ల అభివృద్ధి పనులను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి లు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకుబ్ రెడ్డి, ఈశ్వర్, శ్రావణ్ కుమార్, రాజు, శ్రీనివాస్, మల్లయ్య, చెల్లయ్య, నర్సింగ్, కార్తిక్, రాజేష్ ,స్థానిక నాయకులు కుంటి కృష్ణ, చిగుళ్ల శ్రీనివాస్, తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, అల్లాడి కృష్ణ యాదవ్, రఘు, శ్రీనివాస్, శంకర్, నర్సింగ్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలు విడుదల




అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. మే 3 నుంచి 9వరకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలకు 4వేల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఏపీపీఎస్సీ జాప్యం లేకుండా మూల్యాంకనం పూర్తి చేసి నెల రోజుల్లోనే ఫలితాలు విడుదల చేసింది. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను మౌఖిక పరీక్షలకు ఎంపిక చేసింది. ఈనెల 23 నుంచి 30 వరకు గ్రూప్ 1 ఇంటర్వ్యూలు జరగనున్నాయి.

## సింగరేణి సులబ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

* డీజీఎం పర్సనల్ కొత్తగూడెం ఏరియా శివ కేశవరావు కి సమ్మె నోటీసు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న సులబ్ కార్మికుల కనీస వేతనాలు, చట్టబద్ధహక్కులు, సౌకర్యాలు కల్పించాలని సింగరేణి డీజీఎం పర్సనల్ కొత్తగూడెం ఏరియా శివ కేశవరావు కి సమ్మె నోటిసు ను మంగళవారం ఐ ఎఫ్ టి యు నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న జీతాలను విడుదల చేయాలన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న సులబ్ టెండర్లను రద్దు చేయాలని కోరారు. గతంలో సులబ్ వర్కర్స్ సమస్యలపై దశల వారి ఆందోళనలు చేసిన ఫలితం లేదని ఈ నెల 5న హెడ్ ఆఫీస్ ముందు ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదని ,సింగరేణి వ్యాప్తంగా సులబ్ వర్కర్స్ అనివార్య పరిస్థితుల్లో ఈ నెల 15 నుండి సమ్మెలోకి పోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఎసిసి డబ్ల్యూ యుఐఎఫ్ టియు) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్, జిల్లా నాయకులు కే వాసు, సులబ్ కాంట్రాక్ట్ కార్మికులు రాజేష్,వాసుకి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో యోగా డే ఏర్పాట్లపై ప్రధాని మోదీ ఆరా



దిల్లీ: ఏపీలో ఈనెల 21న నిర్వహించనున్న యోగా డే కార్యక్రమం ఏర్పాట్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరా తీశారు. ఆపరేషన్ సిందూర్‌పై నాలుగు దేశాల్లో పర్యటనపై పలు అంశాలను తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రధానిని కలిసి వివరించారు. ఈ సందర్భంగా యోగా డే అంశం ప్రస్తావనకు వచ్చింది. ‘‘మంత్రి లోకేశ్ వ్యక్తిగతంగా యోగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్టు తెలిసింది. గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నాలు చేస్తున్నారని విన్నాను. లోకేశ్ ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారట కదా’’ అని ప్రధాని అన్నారని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధని ప్రధాని అభినందించారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రదేశాల్లో యోగా నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజాప్రతినిధులు అంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్ధమయ్యారని ప్రధానికి వివరించినట్టు పేర్కొన్నారు.

## జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి



దిల్లీ: జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. నేటి నుంచి రెండేళ్లపాటు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా కొనసాగనున్నారు. ‘రా’ చీఫ్ అలక్ జోషి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ భద్రతా సలహా బోర్డును ఏర్పాటు చేసింది. ప్రధాని నేతృత్వంలో ఉన్న జాతీయ భద్రతా కౌన్సిల్‌కి ఈ బోర్డు సూచనలు చేయనుంది. బోర్డులో ఏడుగురు సభ్యులకు ఆరుగురిని ఇప్పటికే నియమించింది. వారిలో మాజీ వెస్ట్రన్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, ఆర్మీ సథరన్ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, రియర్ అడ్మిరల్ మోంటీ ఖన్నా, విశ్రాంత ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్‌సింగ్, మాజీ విదేశాంగ శాఖ అధికారి బి. వెంకటేశ్ వర్మ ఉన్నారు. తాజాగా రక్షణ రంగ నిపుణుడు సతీశ్‌రెడ్డికి బోర్డులో చోటు కల్పించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడిగా కూడా ఉన్నారు.

## శాంతిభద్రతలు భగ్నం చేసేందుకు ఆ వ్యాఖ్యలు.. కొమ్మినేని రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

మంగళగిరి: అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు ముందస్తు ప్రణాళిక ప్రకారమే దురుద్దేశంతో చేశారని సాక్షి టీవీ ఛానల్ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే అమరావతిపై నిందలు మోపారని, వ్యాఖ్యల వెనుక కుట్రను ఛేదించాల్సి ఉందన్నారు. ‘‘సమాజంలో అశాంతి, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు నేరపూరిత కుట్రతోనే ఈ తరహా వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నాం. సాక్షి టీవీలో డిబేట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలోనే జరిగింది. అదే డిబేట్‌లో వీవీఆర్ కృష్ణంరాజు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆ వ్యాఖ్యలను ఖండించకుండా సమర్థిస్తూ మాట్లాడారు. తాను కూడా పత్రికల్లో ఆ వార్తలు చూశానని పరోక్షంగా కృష్ణంరాజును ప్రోత్సహించారు. కొమ్మినేని శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకొని విచారిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి. విచారణలో అతను పోలీసులకు సహకరించలేదు. దర్యాప్తు సంస్థలను తప్పుదోవ పట్టించే విధంగా సమాధానాలిచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు భగ్నం చేసేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేనిని రిమాండ్‌కు పంపాలి, ఈ కేసులో మరి కొందరు సాక్షులను విచారించాల్సిన అవసరం ఉంది. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాల్సి ఉంది’’ అని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యల కేసులో అరెస్టయిన సాక్షి ఛానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు ను పోలీసులు గుంటూరు జిల్లా మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అనంతరం గుంటూరు జిల్లా జైలుకు ఆయనను తరలించారు.

## ఈ నెల 12న దిశా సర్వసభ్య సమావేశం




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్త గూడెం: ఐ డి ఓ సి కార్యాలయం లో దిశా కమిటీ సమావేశం గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్ మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ , జిల్లాకు చెందిన శాసనమండలి, శాసనసభ్యులు, దిశా కమిటీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పలువురు పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలలో చేపడుతున్న పనుల పై నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజలు మతాల మధ్య విబేధాలు పెట్టుకోకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలి

* కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు మతాల మధ్య విబేధాలు పెట్టుకోకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. లెనిన్ నగర్ , భూదేవిహిల్స్ ప్రజలతో కలిసి హిందూ, ముస్లిం మతాల మధ్య నెలకొన్న స్మశానవాటిక సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.ఈ సందర్భంగా అయా కాలనీ వాసులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ను షాపూర్ నగర్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గం ప్రజల నుండి వచ్చిన ఆహ్వానలు,వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఉన్నత అధికారులతో మాట్లాడి, అతి త్వరలో మీ అందరి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కుల, మత సామరస్యాలకు ప్రతీక మన కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు,మహిళ సంఘాలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

* మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డా. సి ఉమా గౌరి



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డా. సి ఉమా గౌరి సూచించారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని హబ్సిగూడలో ఉన్న బస్తీ దవాఖానను ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా డా సి ఉమా గౌరీ ఆరోగ్య సేవల పై సమీక్ష నిర్వహించారు , రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత వైద్య అధికారికి , సిబ్బందికి సూచనలు చేశారు. దోమల వల్ల వ్యాపించే జ్వరాల నివారణకు జిహెచ్ఎంసి శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కర్ణాటకలో మరోసారి కులగణన.. కాంగ్రెస్ హైకమాండ్ సూచన



దిల్లీ: కర్ణాటక ప్రభుత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం కీలక సూచన చేసింది. రాష్ట్రంలో మరోసారి కులగణన చేపట్టే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. నిర్ణీత కాలపరిమితి లోగా తిరిగి కులగణన చేపట్టాలని సీఎం సిద్ధరామయ్యకు సూచించింది. ఈ మేరకు దిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు నేతలు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో పరిస్థితులపై సవివరమైన, ఫలవంతమైన చర్చ జరిగిందన్నారు. తాము చర్చించిన ప్రధాన అంశాల్లో కులగణన ఒకటి అన్నారు. ఈ అంశంపై జూన్ 12న కర్ణాటక క్యాబినెట్ ప్రత్యేక సమావేశమై చర్చిస్తుందని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన విధానాన్ని తాము సూత్రప్రాయంగా ఏకీభవిస్తున్నప్పటికీ.. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కొన్ని వర్గాల్లో ఆందోళనలు ఉన్నాయన్నారు. గతంలో చేపట్టిన కుల గణన సమాచారం దాదాపు పదేళ్ల క్రితానిది గనక నిర్ణీత కాలపరిమితి (6080 రోజుల్లో) లోగా తిరిగి కులగణన చేపట్టే అంశాన్ని పరిశీలించాలని కర్ణాటక సీఎంకు పార్టీ సూచించిందన్నారు. దీనిపై సీఎం సిద్ధరామయ్య మరిన్ని వివరాలను అందిస్తారని చెప్పారు. అలాగే, ఈ భేటీలో కర్ణాటకలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన విషాద ఘటనపైనా చర్చించినట్లు వేణుగోపాల్ తెలిపారు. తొక్కిసలాట ఘటన, తదనంతర పరిణామాలను కాంగ్రెస్ అగ్రనేతలకు కర్ణాటక సీఎం, పీసీసీ చీఫ్ వివరించారని తెలిపారు. ప్రతి ఒక్కరి ప్రాణాన్ని తమ పార్టీ ఎంతో విలువైనదిగా భావిస్తుందన్న కేసీ వేణుగోపాల్.. ఈ దురదృష్టకర ఘటనలో ఏం జరిగిందో స్పష్టంగా తెలుసుకొనేందుకు ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిందన్నారు. ప్రజానుకూల వైఖరితో తమ పార్టీ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కర్ణాటక పట్ల కేంద్ర ప్రభుత్వం తీరు ఆమోద యోగ్యం కాదన్నారు. 2015లో కర్ణాటక వెనుకబడిన వర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలో ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ తాజా నిర్ణయం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

## కర్ణాటకలో ముడా కుంభకోణం..
# రూ.100 కోట్ల విలువైన ఆస్తులు జప్తు



కర్ణాటకలో మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ స్కామ్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రూ.100 కోట్లు విలువైన 92 స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తుచేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకుంది. మైసూరు లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసి విచారణ చేస్తోంది. ఆ ఆస్తులన్నీ ప్రముఖ వ్యక్తులకు చెందిన బినామీల చేతిలో ఉన్నాయని పేర్కొంది. కర్ణాటకలో ముడా స్కామ్ కలకలం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో గతంలో సీఎం సిద్ధరామయ్యపై కేసు కూడా నమోదైంది. 'ముడా' స్థలాల కేటాయింపుల్లో సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె. అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్ ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేశారు. వాటి ఆధారంగా గతేడాది సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే విచారణ అనంతరం ఈ స్కామ్‌లో సిద్ధూ, ఆయన బంధువుల పాత్ర లేదంటూ కర్ణాటక లోకాయుక్త పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఒత్తిడితోనే లోకాయుక్త పోలీసులు ముఖ్యమంత్రికి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు అప్పట్లో భాజపా ఆరోపించింది.

# ఎన్సీపీ ముక్కలవుతుందని అసలు ఊహించలేదు



పుణె: నేషనల్ కాంగ్రెస్ పార్టీ ముక్కలవుతుందని కలలోనైనా ఊహించలేదని ఆ పార్టీ సహవ్యవస్థాపకుడు, ప్రస్తుత ఎన్సీపీ (ఎస్పీ)అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. పార్టీ చీలిపోయినా సవాళ్లను ఎదుర్కొని కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లిన నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. ఎన్సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రారంభం నుంచి పార్టీ ఎన్నో సవాళ్లను, ఒడిదొడుకులను ఎదుర్కొందని చెప్పారు. అయినప్పటికీ నిరుత్సాహపడకుండా పార్టీని ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. ''పార్టీ ముక్కలవుతుందని అసలు ఊహించలేదు. కానీ, కొద్ది మంది వ్యక్తుల భావజాలాలు పార్టీని విడగొట్టాయి. దాని గురించి పెద్దగా మాట్లాడదలచుకోలేదు. పార్టీ సిద్ధాంతాలను నమ్మినవారే అందులో కొనసాగగలరు. రానున్న ఎన్నికల్లో సరికొత్త మలుపులు చూస్తారు. పార్టీలో ఎవరు చేరుతున్నారు? ఎవరు వెళ్లిపోతున్నారు? తదితర విషయాలేవీ పట్టించుకోవద్దు. మనమంతా కలిసికట్టుగా ప్రజలను ఏకం చేయగలిగితే ఎలాంటి సమస్యలు దరిచేరవు. ప్రజలకు సేవ చేయాలని చాలా మంది నాయకులు కృతనిశ్చయంతో ఉన్నారు. వాళ్లే పార్టీకి బలం, బలగం. అధికారం గురించి ఆలోచించొద్దు. మనమంతా కలిసి ఉంటే.. అది మనల్ని ఫాలో అవుతుంది'' అని పవార్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. మరో రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, పార్టీ నాయకత్వమంతా చురుగ్గా పాల్గొని, మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్సీపీ (ఎస్పీ) కొత్త తరం నాయకులను తయారు చేసేందుకు కృషి చేస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఉన్నందున ఏయే చోట్ల వారిని పోటీకి నిలిపితే ప్రయోజనాలు ఉంటాయో ప్రణాళికలు రచించాలని కోరారు. 2023 జులైలో ఎన్సీపీ రెండుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉన్న అజిత్ పవార్‌కు పార్టీ పేరు, గుర్తులను ఎన్నికల సంఘం... శరద్ పవార్ వర్గానికి ఎన్సీపీ (ఎస్పీ) పేరును ఖరారు చేసింది.

## రూ.20లక్షల సుపారీ ఇచ్చి..
# భర్తను లోయలోకి తోసేందుకు సహకరించి..!



మేఘాలయలో నవ వధూవరులు అదృశ్యమైన కేసులో వధువు సోనమే పథకం ప్రకారం కిరాయి హంతకులతో భర్త రాజా రఘువంశీని హత్య చేయించినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఈ కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ నిందితులకు ఆమె లక్షల రూపాయల డబ్బు ఆఫర్ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి రాజా రఘువంశీని హత్య చేసేందుకు తొలుత కిరాయి హంతకులకు సోనమ్ రూ.4లక్షలు ఇవ్వజూపిందని సమాచారం. తర్వాత ఆ మొత్తాన్ని రూ.20లక్షలకు పెంచిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అలాగే తన భర్త మృతదేహాన్ని లోయలో విసిరేసేందుకు నిందితులకు సహకరించిందని పేర్కొన్నాయి. మే 11న రాజా రఘువంశీతో సోనమ్‌కి వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. మే 23 నుంచి వారి ఆచూకీ గల్లంతైంది. అదృశ్యమైన 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అతడి తలకు బలమైన గాయాలు, శరీరంపై కత్తి గాయాలు అయినట్లు శవ పరీక్షలో తాజాగా తేలింది. ఇదిలాఉంటే.. నిందితులు, మృతుడు ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో మేఘాలయలో ఎదురుపడ్డ వారు మాట్లాడుకున్నారని తెలుస్తోంది. ఇందౌర్‌కు చెందిన విశాల్‌సింగ్ చౌహాన్ (22), రాజ్‌సింగ్ కుశ్వాహ (21), ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలిత్‌పుర్‌కు చెందిన ఆకాశ్ రాజ్‌పూత్ (19)ను ఈ కేసులో అరెస్టు చేశారు. రఘువంశీని తాను చంపించలేదని, తననే ఎవరో అపహరించారని సోనమ్ చెప్పడం గమనార్హం. కేసులో అరెస్టయిన రాజ్ కుశ్వాహతో సోనమ్‌కు సాన్నిహిత్యం ఉందని సమాచారం. అతడే ఈ హత్య ప్లాన్‌ను నడిపించాడని పోలీసులు వర్గాలు తెలిపాయి. అంతా సోనమ్, కుశ్వాహ ప్లాన్ ప్రకారమే జరిగింది. అయితే హత్యకు వారు ఉపయోగించిన పదునైన ఆయుధంతో అంతా తారుమారు అయినట్లు తెలుస్తోంది. ''ఇలాంటి ఆయుధాన్ని సాధారణంగా మేఘాలయలో ఉపయోగించరు. దాంతో బయటివ్యక్తి ప్రమేయం ఉందని మాకు అనుమానం వచ్చింది. తర్వాత మేం కాల్ రికార్డులను పరిశీలించాం'' అని పోలీసు అధికారి వెల్లడించారు.

# ప్రైవేటు పాఠశాల ఫీజుల నియంత్రణపై ఆర్డినెన్స్



దిల్లీ: ముఖ్యమంత్రి రేఖా గుప్తా నేతృత్వంలోని దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు పాఠశాలలు వసూలు చేసే ఫీజులను నియంత్రించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ మేరకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు దిల్లీ విద్యాశాఖ మంత్రి ఆశిష్ సూద్ తెలిపారు. దిల్లీ స్కూల్ ఎడ్యుకేషన్ బిల్ 2025ను ఆర్డినెన్స్ రూపంలో తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏప్రిల్ 1, 2025 తేదీ నుంచి దీనిని అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. ''ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ రోజు ఎంతో సంతోషాన్నిస్తుంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిస్తాం. అనంతరం ఓ దీనిని చట్టంగా రూపొందిస్తాం'' అని మంత్రి వెల్లడించారు.

# మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసింది : రాజ్‌నాథ్ సింగ్



దేహ్రాదూన్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 11 ఏళ్ల పాలనలో దేశ భద్రతను మరింత బలోపేతం చేశామని అన్నారు. దేహ్రాదూన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ''గత 11 ఏళ్లలో మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసింది. దేశ భద్రత విషయంలో కేంద్రం వ్యవహార శైలి మారింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఇది స్పష్టమైంది. భారత చరిత్రలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకున్న అతి పెద్ద చర్య. దీన్ని ప్రపంచమంతా చూసింది. '' అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. కాగా.. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తాము బాధ్యులమని పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు చెందిన ''ది రెసిస్టెన్స్ ఫ్రంట్'' బాధ్యత ప్రకటించుకుంది.

# 4వ తరగతి నాటి కొట్లాట..50 ఏళ్ల తర్వాత ప్రతీకార దాడి!



చిన్ననాటి స్నేహితులు 50ఏళ్ల తర్వాత కలిస్తే..ఇన్నేళ్ల తర్వాత కలిసిన మిత్రుడిని చూసి మురిసిపోతుంటారు. అప్పట్లో వారు గడిపిన క్షణాలు, చేసిన అల్లరి గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఆ స్నేహబంధాన్ని ఇలాగే కొనసాగించాలని అనుకుంటారు. కానీ కేరళలోని కొందరు స్నేహితుల ప్రవర్తన మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. చిన్నప్పుడు స్నేహితుడు కొట్టాడనే కోపంతో దాదాపు 50 ఏళ్ల అనంతరం ఓ వ్యక్తి తన మిత్రుడిపై దాడి చేశాడు. అసలేమయ్యిందంటే? కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాకు చెందిన బాలకృష్ణన్, వీజే బాబులు సుమారు 50 ఏళ్ల క్రితం స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కలిసి చదువుకున్నారు. వారు 4వ తరగతిలో ఉన్నప్పుడు వీజే బాబు, బాలకృష్ణన్ మధ్య గొడవ జరగడంతో బాలకృష్ణన్‌ను అతడు కొట్టాడు. కొద్దిరోజులకు వారు ఆ పాఠశాల నుంచి వెళ్లిపోయారు. ఇటీవల బాలకృష్ణన్ అతడి స్నేహితుడు మాథ్యూతో సరదాగా బయటకు వెళ్లిన సమయంలో వారిని వీజే బాబు కలిశారు. అయితే చిన్ననాడు బాబు తనను కొట్టాడనే విషయాన్ని మనసులో పెట్టుకున్న బాలకృష్ణన్ మాటల మధ్యలో నాలుగో తరగతిలో ఉన్నప్పుడు తనను ఎందుకు కొట్టావని ప్రశ్నించాడు. అనంతరం అతడిపై దాడి చేశాడు. మాథ్యూ కూడా వీజే బాబుని తీవ్రంగా కొట్టడంతో గాయాలపాలైన బాబు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఆశ్చర్యపోయిన పోలీసులు బాలకృష్ణన్, మథ్యూను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రస్తుతం బాధితుడు కన్నూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## మస్క్‌తో స్నేహానికి బీటలు..
## టెస్లా కారుపై ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య బంధం ఇటీవల బీటలువారిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మస్క్‌కు చెందిన టెస్లా నుంచి కొనుగోలు చేసిన కారును ట్రంప్ దూరం పెడతారనే ప్రచారం జరిగింది. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మస్క్ కు చెందిన టెస్లా కంపెనీ నుంచి ట్రంప్ ఇటీవల ఓ కారు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మస్క్, ట్రంప్‌ల మధ్య వివాదం సమయంలో ఆ కారు వైట్‌హౌస్ వద్ద ఉంది. దీంతో ట్రంప్ ఆ కారును వదులుకుంటారని జోరుగా ప్రచారం జరిగింది. సోమవారం విలేకరుల సమావేశంలో ఓ విలేకరి దీనిపై ప్రశ్నించారు. దీనికి ట్రంప్ బదులిస్తూ.. 'అలాంటిదేమీ లేదు. నేను అందులో చక్కర్లు కొడతా' అని పేర్కొన్నారు. ఈసందర్భంగా వైట్‌హౌస్‌లో స్టార్‌లింక్ సేవలను నిలిపివేసే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టంచేశారు. అది మంచి సేవలను అందిస్తుందని కొనియాడారు. ఇక, మస్క్‌తో మాట్లాడాలనుకుంటున్నారా? అని మరో విలేకరి ప్రశ్నించగా.. 'నేను అతడి స్థానంలో ఉంటే.. మాట్లాడాలనే అనుకునేవాడిని. అతడు అదే అనుకుని ఉండవచ్చు. ఈ విషయం అతడినే అడగాలి. మా మధ్య మంచి సంబంధం ఉంది. అతనికి అభినందనలు తెలుపుతున్నా' అని పేర్కొన్నారు. కాగా.. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియోను ఓ నెటిజన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి మస్క్ హార్ట్ ఎమోజీతో రియాక్టయ్యారు. ఇదిలా ఉండగా.. టెస్లా అధినేత వైట్‌హౌస్‌లో డ్రగ్స్ వినియోగించారా అనే ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. తనకు దాని గురించి కచ్చితంగా తెలియదన్నారు. అయితే మస్క్ అలా చేసి ఉండరనే నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. ట్రంప్ 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను మస్క్ వ్యతిరేకించిన నేపథ్యంలో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. ఆ తర్వాత వీరిద్దరూ బహిరంగంగానే పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి తానే కారణమని మస్క్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తోసిపుచ్చారు. తానెవరి సాయం లేకుండా నెగ్గానని, డోజ్ నుంచి తప్పించినందుకే మస్క్‌కు అంత ఆక్రోశమని విమర్శించారు. ఈ క్రమంలోనే లైంగిక వేధింపుల నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టైన్ కేసులో ట్రంప్ పాత్ర ఉందని, అందుకే ఆ కేసు దర్యాప్తు పత్రాలు బయటపెట్టడం లేదని టెస్లా అధినేత ఆరోపించారు.

## సైన్యాన్ని పంపించకుంటే..
## లాస్ ఏంజెలెస్ కాలి బూడిదయ్యేది : ట్రంప్

అక్రమ వలసదారుల అరెస్టుతో అగ్గి రాజుకున్న లాస్ ఏంజెలెస్ నగరంలో నిరసనల పర్వం నాలుగోరోజు కొనసాగుతోంది. ఈ అల్లర్లను అణచివేసేందుకు నేషనల్ గార్డులను మోహరించడాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. ఒకవేళ మెరైన్స్‌తోపాటు ఇతర సైనిక బలగాలను పంపించకుంటే ఆ నగరం కాలి బూడిదైపోయేదన్నారు. "లాస్ ఏంజెలెస్‌కు బలగాలను పంపించకుంటే ఒకప్పుడు అందమైన, గొప్ప నగరంగా ఉన్న నగరం నాశనమయ్యేది" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. లాస్ ఏంజెలెస్‌లో అసమర్థ గవర్నర్, మేయర్‌ల వల్లే ప్రస్తుతం ఆ పరిస్థితులు నెలకొన్నాయని తీవ్ర స్థాయిలో



విమర్శలు గుప్పించారు. వీరి తీరుతో అనేక ఇళ్లు తగలబడ్డాయని అన్నారు. నగరంలో అల్లర్లను అణచివేసేందుకు 700 మంది మెరైన్స్‌తోపాటు 4000 మంది నేషనల్ గార్డులను మోహరించడాన్ని అధ్యక్షుడు ట్రంప్ సమర్థించుకున్నారు. అధ్యక్షుడు ట్రంప్‌పై కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన చర్యలు నియంతృత్వ పోకడలకు గుర్తుచేస్తున్నాయన్నారు. తన అనుమతి లేకుండా బలగాలను పంపించడంపై అధ్యక్షుడిపై దావా వేస్తానని హెచ్చరించిన ఆయన.. అందుకు అనుగుణంగా చర్యలకు ఉపక్రమించింది.

## ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సిద్ధం.. ఏర్పాట్లు షురూ!



అమెరికా, ఇరాన్ అణుఒప్పందంపై చర్చించేందుకు మరోసారి సమావేశం కాబోతున్న తరుణంలో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కీలక ప్రదేశాలకు ఆయుధాల తరలింపు పనులు చురుగ్గా సాగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అక్కడి మీడియాలో ప్రచారం జరుగుతోంది. గత ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా విదేశీ వ్యవహారాల నిపుణులు మేరీల్యాండ్‌లోని క్యాంప్ డేవిడ్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఇరాన్ అంశంలో అమెరికా వ్యూహం గురించి గంటలపాటు చర్చించారు. ఈ క్రమంలోనే ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఫోన్ చేసి దాదాపు 40 నిమిషాల పాటు మాట్లాడారు. ఆ తర్వాత నెతన్యాహు రక్షణశాఖ ఉన్నతాధికారులు, కీలక మంత్రులతో అత్యవసర భద్రత సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని అణుకేంద్రాలు, అణుఆయుధాల ఉత్పత్తిలో ఇరాన్ వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. మరోవైపు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుకులకు సిద్ధమవుతున్నట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా పదేపదే చెబుతున్నాయి. అయితే, దాడుల తీవ్రత ఎలా ఉంటుంది? ఎప్పుడు దాడులు చేసే అవకాశం ఉంది? దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇప్పటికే తుది నిర్ణయం తీసుకుందా? అనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. 'అణు బూచి'ని చూపిస్తున్న ఇరాన్ ఒకవేళ ఇజ్రాయెల్ దాడికి పాల్పడితే దీటుగా బదులిచ్చేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రతిచర్యగా ఇజ్రాయెల్‌పై అణు ఆయుధాలను ప్రయోగించే అవకాశముందని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ డైరెక్టర్ రఫేల్ గ్రోసీ ఇజ్రాయెల్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "ఇరాన్ అణుస్థావరాలపై దాడి జరిగితే ఇరానియన్లు చూస్తూ ఊరుకోరు. న్యూక్లియర్ ఆయుధాన్ని ఇజ్రాయెల్‌పై ప్రయోగించే అవకాశం ఉంది.

## ఏసీలకు టెంపరేచర్ లిమిట్..
## ఇక కనిష్ఠం 20 డిగ్రీలే!



ఢిల్లీ: దేశంలో ఎయిర్ కండీషనర్ల వినియోగానికి సంబంధించిన కొత్త నిబంధనలు రాబోతున్నాయి. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడంలో భాగంగా ఏసీల టెంపరేచర్‌కు కేంద్ర ప్రభుత్వం పరిమితి విధించేందుకు సిద్ధమవుతోంది. కనిష్ఠంగా 20 డిగ్రీ సెల్సియస్, గరిష్ఠంగా 28 డిగ్రీల సెల్సియస్ మించకుండా కొత్తగా తయారయ్యే ఏసీలకు ప్రమాణాలను నిర్దేశించనున్నట్లు కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు. "ఏసీలకు కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్, గరిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్ ఉండాలని నిర్ణయించాం. త్వరలోనే దీన్ని అమలు చేయనున్నాం. ఏ మేర సత్ఫలితాలను ఇస్తుందో చూస్తాం. ఏసీల వినియోగంలో ఏకరూపత తీసుకురావడం, తద్వారా అధిక విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశం" అని కేంద్రమంత్రి పేర్కొన్నారు. దేశంలో చాలా ఇల్లు, ఆఫీసుల్లో 20 డిగ్రీల కంటే దిగువనే ఏసీలను వినియోగిస్తున్నారని ఖట్టర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొన్ని ఏసీలు కనిష్ఠంగా 16 డిగ్రీలు, కొన్ని 18 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతతో వస్తున్నాయి. ఇకపై 20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నుంచి ప్రారంభం అవుతాయి. ఏసీల వినియోగం తీరుతెన్నుల గురించి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (BEE) ఓ సర్వే నిర్వహించింది. చాలా వరకు ఏసీలు 2021 డిగ్రీల మధ్యే నడుస్తున్నట్లు గుర్తించింది. వాస్తవానికి ఏసీని 2425 డిగ్రీల మధ్య వినియోగిస్తే ఆ మేర విద్యుత్ ఆదా అవుతుందని పేర్కొంది. ఒక్కో డిగ్రీ సెల్సియస్ పెంచుకుంటూ వెళ్లడం వల్ల 6 శాతం మేర విద్యుత్ ఆదా అవుతుందని తెలిపింది. తద్వారా విద్యుత్ బిల్లుతోపాటు, కర్బన ఉద్గారాలను తగ్గించడం వీలు పడుతుందనేది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.

## బిజినెస్
## BUSINESS

### చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం..?



ఓపెన్ ఏఐ కి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ ఎలాంటి క్లిష్ట ప్రశ్నకైన అలవోకగా సమాధానం చెబుతుంది. అందుకే చాలా మంది దీన్ని వాడేందుకు మక్కువ చూపుతుంటారు. అయితే.. ప్రస్తుతం ఈ సేవలకు అంతరాయం కలుగుతున్నట్లు సమాచారం. దీనిపై యూజర్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. భారత్ సహా ప్రపంచ దేశాల్లోని యూజర్లు ఈ ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. డౌన్‌డిటెక్టర్' వెబ్‌సైట్ వివరాల ప్రకారం .. చాట్‌జీపీటీ ప్రశ్నలు వేయగా దాన్ని స్వీకరించేందుకు నిరాకరిస్తోంది. ప్రశ్న తీసుకున్నా త్వరగా స్పందించడం లేదు. వీటితో పాటు మరికొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నామని వినియోగదారులు తెలిపారు. ఇప్పటివరకు 1,000 మందికి పైగా ఫిర్యాదులు వచ్చాయి. యాప్ వినియోగించే సమయంలో త్వరగా ప్రతిస్పందించడం లేదంటూ 93 శాతం మందికి పైగా ఫిర్యాదు చేశారు. లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నామని 6 శాతం మంది తెలిపారు.

## జీటీ 7 ఫోన్లపై రియల్‌మీ ఆఫర్.. రూ.6 వేల వరకు డిస్కౌంట్!

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ రియల్‌మీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తాజాగా లాంచ్ చేసిన 'జీటీ 7' సిరీస్ ఫోన్లపై డిస్కౌంట్ అందిస్తోంది. 'బెస్ట్‌సెల్లర్ డే' పేరిట తీసుకొచ్చిన ఈ సేల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ఈ సేల్‌లో భాగంగా రియల్‌మీ జీటీ 7, రియల్‌మీ జీటీ 7టీపై బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ బోనస్, నో కాస్ట్ ఈఎంఐ ఇలా అనేక కొనుగోలు ఆప్షన్లు అందిస్తోంది. జూన్ 13 వరకు మాత్రమే ఈ సేల్ అందుబాటులో ఉంటుంది. రియల్‌మీ అధికారిక వెబ్‌సైట్, అమెజాన్ వేదికగా కొనుగోలు చేసి ఈ ఆఫర్ సొంతం చేసుకోవచ్చు.

**రియల్‌మీ జీటీ 7**

ఆఫర్‌లో భాగంగా రియల్‌మీ జీటీ7 మొబైల్‌పై ఎంపిక చేసిన బ్యాంక్ సాయంతో కొనుగోలు చేస్తే రూ.3 వేలు రాయితీ పొందొచ్చు. లేదా రూ.5,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందొచ్చు. 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.39,999 ఉండగా.. ఆఫర్ సమయంలో రూ.34,999కు కొనుగోలు చేయొచ్చు. 12జీబీ+256జీబీ వేరియంట్ రూ.37,999, 12జీబీ+512జీబీ వేరియంట్ రూ.41,999కే లభిస్తుంది.



ఫీచర్లు: రియల్‌మీ జీటీ7 ఫోన్ 6.78 అంగుళాల ఎల్‌టీపీఎస్ అమోలెడ్ 1.5k డిస్‌ప్లేతో వస్తోంది. ఆండ్రాయిడ్ 15తో పనిచేసే రియల్‌మీ యూఐ 6.0తో పనిచేస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్‌తో వస్తోంది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 9400ఈ చిప్‌సెట్ అమర్చారు. 7,700 ఎంఎం వ్యాపర్ ఛాంబర్ కూలింగ్ సెటప్ ఉంది. 7000బ్యాటరీ, 120W ఫాస్ట్ ఛార్జింగ్‌తో తీసుకొచ్చింది. 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 906 ప్రధాన కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. ఏఐ ఫీచర్లతో తీసుకొచ్చారు.

**రియల్‌మీ జీటీ 7టీ**

'బెస్ట్‌సెల్లర్ డే' లో భాగంగా రియల్‌మీ జీటీ 7టీని కొనుగోలు చేస్తే రూ.3,000 ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లేదా రూ.6,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందొచ్చు. అంటే 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.34,999కాగా సేల్ సమయంలో కొనుగోలు చేస్తే రూ.28,999కే లభిస్తుంది. 12జీబీ+256జీబీ వేరియంట్ రూ.31,999, 12జీబీ+512జీబీ వేరియంట్‌పై డిస్కౌంట్ లభిస్తుంది. రియల్‌మీ జీటీ 7టీ 6.68 అంగుళాల డిస్‌ప్లేతో వస్తోంది. ఇది కూడా 1.5k రిజల్యూషన్‌తో వస్తోంది. 120Hz రిఫ్రెష్ రేటు ఉంది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 8,400 మ్యాక్స్ ప్రాసెసర్ అమర్చారు. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 32 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. జీటీ 7 తరహాలోనే సాఫ్ట్‌వేర్, బ్యాటరీ, ఛార్జింగ్ స్పీడ్ వంటివి ఉన్నాయి.

# వరుస లాభాలకు బ్రేక్..

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటిక మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,680.79 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. అత్యల్పంగా 82,240.40 పాయింట్ల కనిష్టానికి తగ్గింది. చివరకు 53.49 పాయింట్లు పతనమై.. 82,391.72 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,160 షేర్లు పెరిగాయి. మరో 1,723 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ లాభపడగా.. ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పతనం కాగా.. ఐటీ ఇండెక్స్ 1.7 శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. పవర్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది.

# భారత్‌లో 46 కోట్ల మంది డిజిటల్ చెల్లింపులను ఉపయోగిస్తున్నారు : కేంద్రం




**న్యూఢిల్లీ:** భారతదేశంలో జరుగుతున్న డిజిటల్ చెల్లింపు విప్లవం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలతోనూ అనుసంధానించినట్లు తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విడుదల చేసిన బుక్‌లెట్‌లో పేర్కొంది. 'భారతదేశంలో జరుగుతున్న డిజిటల్ చెల్లింపు విప్లవం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ ఏడాది మార్చిలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్‌లో సుమారు రూ.24.77 లక్షల కోట్ల విలువైన 1,830.151 కోట్ల యూపీఐ లావాదేవీలు' జరిగాయి' అని పేర్కొంది. ఈ వ్యవస్థను ప్రస్తుతం దాదాపు 460 మిలియన్ల మంది యూజర్లతో పాటు 65 మిలియన్ల వ్యాపారులు ఉపయోగించుకుంటున్నారని కేంద్రం తెలిపింది. చిన్న చిన్న లావాదేవీలు సైతం డిజిటల్ చెల్లింపుల్లోనే జరుగుతున్నాయని పేర్కొంది.

దాదాపు 50శాతం చిన్న, సూక్ష్మ చెల్లింపులుగా వర్గీకరించినట్లు పేర్కొంది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విషయానికి వస్తే.. పాలనలో పారదర్శకతను, అక్రమాలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఈ సాంకేతిక సహాయంతో సమర్థవంతం వినియోగించుకున్నట్లు తెలిపింది. వివిధ సంక్షేమ పథకాల్లో నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయడం, ఆధార్‌ను తీసుకురావడం వల్ల లక్షలాది మంది అనర్హులను తొలగించినట్లు పేర్కొంది. ప్రభుత్వానికి భారీగా డబ్బు ఆదా అయ్యిందని.. దాంతో ప్రజలకు సకాలంలో వివిధ ప్రయోజనాలు అందించగలిగినట్లు పేర్కొంది. 2015 -2023 మధ్య డీబీటీ ద్వారా ప్రభుత్వానికి రూ.3.48లక్షల కోట్లు ఆదా అయ్యాయని పేర్కొంది. గత పదకొండేళ్లలో కోట్లాది కుటుంబాలు బ్యాంకు ఖాతా, బీమా సహా ప్రాథమిక సౌకర్యాలు పొందాయని పేర్కొంది. పదకొండేళ్లలో 55.22 కోట్ల జన్ ధన్ ఖాతాలు తెరవడంతో పాటు 51 కోట్ల మంది ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పరిధిలోకి తీసుకువచ్చినట్లు కేంద్రం వివరించింది.

# పెరిగిన భారత్ చక్కెర ఎగుమతులు

### అత్యధికంగా సోమాలియాకే..!



**న్యూఢిల్లీ:** భారత్ చక్కెర ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరం 2024-25 జూన్ 6 వరకు భారత్ 5.16 లక్షల టన్నుల షుగర్‌ను ఎగుమతి చేసింది. ట్రేడ్ బాడీ ఆల్ ఇండియా షుగర్ ట్రేడ్ అసోసియేషన్ మంగళవారం డేటా ప్రకారం.. చక్కెర మార్కెటింగ్ సంవత్సరం అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు నడుస్తుంది. భారతదేశంలో 2024-25 మార్కెటింగ్ సంవత్సరానికి చక్కెర ఎగుమతులను జనవరి 20న కేంద్రం అనుమతి చ్చింది. గరిష్ట ఎగుమతి పరిమాణాన్ని 10 లక్షల టన్నులుగా నిర్ణయించింది. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరం జూన్ 6 వరకు మిల్లులు మొత్తం 5,16,782 టన్నుల చక్కెరను ఎగుమతి చేశాయి.

ఇందులో 4.09 లక్షల టన్నుల తెల్ల చక్కెర, 81,845 టన్నుల శుద్ధి చేసిన చక్కెర, 25,382 టన్నుల ముడి చక్కెర ఎగుమతి అయ్యింది. దాదాపు 23,219 టన్నుల చక్కెర లోడింగ్ దశలో ఉన్నది. ఇప్పటివరకు జరిగిన మొత్తం ఎగుమతుల్లో అత్యధికంగా సోమాలియాకు గరిష్టంగా 1,18,553 టన్నుల చక్కెర ఎగుమతి అయ్యింది. ఆ తర్వాత శ్రీలంకకు 76,401 టన్నులు, ఆఫ్ఘనిస్తాన్ కు 72,833 టన్నులు, జిబౌటికి 69,609 టన్నులు ఎగుమతులు జరిగాయని ట్రేడ్ అసోసియేషన్ పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసే సీజన్‌లో 10 లక్షల టన్నుల చక్కెర ఎగుమతి కేంద్రం జనవరిలో అనుమతి ఇవ్వగా.. మొత్తం ఎగుమతులు 8లక్షల టన్నులకు చేరుకోవచ్చని ట్రేడ్ బాడీ ఆల్ ఇండియా షుగర్ ట్రేడ్ అసోసియేషన్ ఇటీవల తెలిపింది.



# నేడే డబ్ల్యూటీసీ ఫైనల్

### ఆసీస్, సఫారీల 11 మంది సైన్యమిదే..!





**లార్డ్స్:** క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు సమయం దగ్గరపడింది. నేడు లార్డ్స్ మైదానంలో మెగా ఫైట్ షురూ కానుండగా.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు టెస్టు గద కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ బిగ్ ఫైట్‌లో గెలిచి ఛాంపియన్‌గా నిలవాలని సఫారీలు అనుకుంటుండగా.. ఐసీసీ ఫైనల్స్‌లో తమ ఆధిపత్యాన్ని చాటేందుకు ఆసీస్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరుజట్లు ఫైనల్లో ఆడబోయే 11 మంది పేర్లను ప్రకటించాయి.

లార్డ్స్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు నేటి(జూన్ 11 బుధవారం)తో తెరలేవనుంది. సీజన్ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు అర్హత సాధించిన ఆస్ట్రేలియా, దక్షిణాలు టైటిల్ కోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. ఇక.. ఐసీసీ ఈవెంట్లలో చోకర్స్‌గా ముద్ర పడిన సఫారీలు ఈసారి టెస్టు గదను వదలొద్దనే కసితో ఉన్నారు. అందుకే.. బలమైన తుదిజట్టును ఎంపిక చేశారు కోచ్, కెప్టెన్.

ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడిన మర్క్‌రమ్, రికెల్టన్, స్టబ్స్‌లతో పాటు వెర్రినే, బెడింగ్‌హమ్‌లు బ్యాటింగ్ భారం మోయనున్నారు. బౌలింగ్ యూనిట్ విషయానికొస్తే.. కగిసో రబడ, యాన్సెన్, కేశవ్ మహారాజ్‌తో పాటు సీనియర్ బౌలర్ అయిన లుంగి ఎంగిడి మూడో పేసర్‌గా జట్టులోకి వచ్చాడు.

**దక్షిణాఫ్రికా తుది జట్టు:** ఎడెన్ మర్క్‌రమ్, రియాన్ రికెల్టన్, వియాన్ మల్డర్, తెంబా బవుమా(కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ బెడింగ్‌హమ్, కైలీ వెర్రినే(వికెట్ కీపర్), మార్కో యాన్సెన్, కేశవ్ మహారాజ్, కగిసో రబడ, లుంగి ఎంగిడి.

### సగానికి పైగా వాళ్లే

వరుసగా రెండోసారి ఫైనల్ చేరుకున్న ఆస్ట్రేలియా మరోసారి విజయంపై కన్నేసింది. నిరుడు ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని సగానికి పైగా ఆటగాళ్లు ఈసారి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. ఖవాజా, లబూషేన్, పేసర్ మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్, హెడ్, కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీలు మరోసారి దేశానికి టెస్టు గదను అందించాలనే కసితో ఉన్నారు.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆడుతున్న ఆసీస్‌కు కమిన్స్ అతిపెద్ద బలం కానున్నాడు. తనదైన వ్యూహాలతో ప్రత్యర్థిని చిత్తుచేయగల సత్తా ప్యాటీ సొంతం. ఉస్మాన్ ఖవాజా, లబూషేన్, చిచ్చరపిడుగు ట్రావిస్ హెడ్, స్మిత్, కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీలతో కంగారూల బ్యాటింగ్ యూనిట్ దుర్భేద్యంగా ఉంది. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన హేజిల్‌వుడ్.. తమకు లక్కీ హ్యాండ్ అవుతాడని కమిన్స్ బృందం భావిస్తోంది.

**ఆస్ట్రేలియా తుది జట్టు:** ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ క్యారీ(వికెట్ కీపర్), ప్యాట్ కమిన్స్(కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హేజిల్‌వుడ్.

### క్రీడల్ని ప్రేమించే నగరంలో తొక్కిసలాట..

# నా మనసుకెంతో బాధగా ఉంది..!



**న్యూఢిల్లీ:** భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద ప్రమాదమైన చిన్నస్వామి తొక్కిసలాటపై రాహుల్ ద్రవిడ్ స్పందించాడు. జూన్ 4 బుధవారం జరిగిన ఈ ఘటనలో 11 మంది మరణించడం తనను ఎంతగానో బాధించిందని అన్నాడీ లెజెండ్. చిన్నస్వామి తొక్కిసలాటను దురదృష్టకరమైనదిగా పేర్కొన్న ద్రవిడ్.. తమ అభిమాన జట్టు విక్టరీ పరేడ్‌ను చూద్దామని వచ్చిన ఫ్యాన్స్ అసువులు బాయడం తన మనసును చాలా బాధిస్తోందని అన్నాడు.

'క్రీడల్ని ఎంతగానో ప్రేమించే నగరం బెంగళూరు. నేను అక్కడి నుంచే వచ్చాను. అక్కడి ప్రజలు క్రికెట్ ఒక్కటే కాదు అన్ని ఆటల్ని చాలా ఇష్టపడుతారు. ఫుట్‌బాల్ జట్టు అయినా.. కబడ్డీ జట్టు అయినా సరే చాలా మద్ధతిస్తారు. ఆర్సీబీ అయితే చాలా పాపులర్. ఎక్కువమంది అభిమానులున్న జట్టు కూడా. అలాంటి సిటీలో ఇంత దారుణం జరగడం దురదృష్టకరం. తొక్కిసలాట విషయం తెలిసి షాకయ్యాను. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వాళ్లకు సంతాపం తెలియజేస్తున్నా. ఈ ప్రమాదంలో గాయపడిన వాళ్లు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని ద్రవిడ్ వెల్లడించాడు.

### బెంగళూరుకు వలస

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జన్మించాడు రాహుల్ ద్రవిడ్. వాళ్లది మరాఠీ బ్రాహ్మణ కుటుంబం. అతడి చిన్నతనంలోనే వాళ్ల కుటుంబం బెంగళూరుకు వలస రావడంతో అతడు అక్కడే పెరిగాడు. దాంతో, ద్రవిడ్ దేశవాళీ క్రికెట్‌లో కర్నాటక తరపున అరంగేట్రం చేశాడు. అందుకే.. అతడికి బెంగళూరు అంటే చాలా ఇష్టం. పైగా ఐపీఎల్ ఆరంభంలో అతడు ఆర్సీబీకి ఆడాడు. ప్రస్తుతం ఈ దిగ్గజ క్రికెటర్ రాజస్థాన్ రాయల్స్ జట్టుకు హెడ్‌కోచ్‌గా సేవలందిస్తున్నాడు.

### 2.5 లక్షల మంది రాకతో..

ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి కప్ కోసం నిరీక్షిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18వ సీజన్‌లో ఛాంపియన్‌గా అవతరించింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై జయభేరి మోగించి తమ ఐపీఎల్ ట్రోఫీ కలను సాకారం చేసుకుంది.

### అంతర్జాతీయ క్రికెట్‌కు విండీస్ విధ్వంసక బ్యాటర్

# నికోలస్ పూరన్ గుడ్‌బై



**వెస్టిండీస్:** అంతర్జాతీయ క్రికెట్ నుంచి మరో స్టార్ ప్లేయర్ తప్పుకున్నాడు. వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ మూడు ఫార్మట్లకు వీడ్కోలు పలికాడు. 29 ఏండ్ల వయస్సులోనే రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచానికి షాకిచ్చాడు. విండీస్ వికెట్ కీపర్-బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. అయితే ఫ్రాంచైజ్ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని వెల్లడించారు. దక్షిణాఫ్రికా క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించిన కొన్ని రోజుల వ్యవధిలోనే పూరన్ అంటర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవడం విశేషం. ఈమేరకు పూరన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని, అయినప్పటికీ చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా అని రాసుకొచ్చాడు.

'చాలా ఆలోచించిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నా. తాము ఎంతో ఇష్టపడే ఈ ఆట చాలా ఇచ్చింది. ఇస్తూనే ఉంటుంది. వెస్టిండీస్ ప్రజలకు ప్రాతినిధ్యంవహించే అవకాశం ఎంతో ఆనందాన్ని, మరపురాని జ్ఞాపకాలు మిగిల్చింది. ఆ మెరూన్ రంగు ధరించడం, జాతీయగీతం కోసం నిలబడటం, మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ పూర్తిస్థాయిలో ప్రదర్శన ఇవ్వడం. నిజంగా మాటల్లో చెప్పడం కష్టం. కెప్టెన్‌గా జట్టును నడిపించడం నేను ఎల్లప్పుడూ గుర్తుంచుకునే గౌరవం' అని రాసుకొచ్చారు. నాపై చూపిన అమితమైన ప్రేమకు ధన్యవాదాలు, కష్ట సమయాల్లో నావెంటే ఉన్నారంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రయాణంలో నాతో కలిసినందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకం, మద్దతు తనను ముందుకు నడిపించాయని చెప్పారు.

# షూటింగ్ వరల్డ్ కప్.. కాంస్యంతో మెరిసిన వలరివన్..!



**న్యూఢిల్లీ:** భారత యువ షూటర్ ఎలవేనిల్ వలరివన్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో కాంస్యం కొల్లగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పిస్టల్ ఫైనల్లో పసిడిపై గురి పెట్టిన తను చివరకు కంచుమోత మోగించింది. జర్మనీలోని మ్యూనిచ్ వేదికగా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అదరగొట్టిన 25 ఏళ్ల ఈ యువకెరటం స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగింది. అయితే.. 231.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

తమిళనాడుకు చెందిన ఎలవేనిల్ వలరివన్ 2018 వరల్డ్ కప్‌లో నాలుగో స్థానంతో నిరాశపరిచింది. అయితే.. మ్యూనిచ్ ఆతిథ్యం ఇస్తున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో మాత్రం అంచనాలకు మించి రాణిస్తోంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో సత్తా చాటిన తను ఫైనల్లో తొలి షాట్‌లోనే 10.7 పాయింట్లు సాధించింది. ఆ తర్వాత 10.8 పాయింట్లు రాబట్టింది. దాంతో, రజతం వస్తుందని ఆశించింది. కానీ, కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

### 0.3 పాయింట్ల తేడాతో..

అయితే.. రెండుసార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడిన వలరివన్ .. కొరియా షూటర్ క్వాన్ యుంజీ కంటే 0.3 పాయింట్లు మాత్రమే వెనకబడింది. లేదంటే ఆమె ఖాతాలో సిల్వర్ మెడల్ చేరేది. ఫైనల్లో చైనీస్ షూటర్ వాంగ్ జీఫీ పసిడి పతకం గెలుపొందగా.. క్వాన్‌ను రజతం వరించింది.



# విజయ్ దేవరకొండ కింగ్‌డమ్‌కు విఎఫ్ఎక్స్ ఎఫెక్ట్

## జులైకి వాయిదా పడడం ఖాయమంటూ వార్తలు

**టాకీస్:** భారీ తెలుగు సినిమాలన్నీ విఎఫ్ఎక్స్ మీదనే ఎక్కువగా ఆధారపడి వుంటుతున్నాయి. ఆ వర్క్ కాస్తంత ఆలస్యమైనా... పోస్ట్ ప్రొడక్షన్ లో ఊహకందని జాప్యం ఏర్పడుతోంది. దాంతో సినిమాలను ముందు ప్రకటించిన తేదీకి విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలోకి నిర్మాతలు జారిపోతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా కూడా ఈ కారణంగానే వాయిదా పడింది. తాజాగా విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మూవీ మళ్లీ వాయిదా పడేలా ఉంది. ఇప్పటికే మే 30న రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించినా.. చివరకు జులై 4కు వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తారని తెలుస్తోంది. కింగ్ డమ్ కంటే ముందే నితిన్ నటించిన తమ్ముడు మూవీ జులై 4న రిలీజ్ డేట్ ప్రకటించింది. తమ్ముడు మూవీ ఉన్నా సరే రిలీజ్ కు ముందు డేర్ చేసింది. కానీ ఇప్పుడు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు జూన్ 12 నుంచి తప్పుకుంది. చూస్తుంటే వీరమల్లు జులై మొదటి వారంలోనే రిలీజ్ కు రెడీ అవుతున్నట్టు సమాచారం. వీరమల్లు జులై మొదటి వారంలోనే వస్తే తమ కింగ్ డమ్ మూవీని వాయిదా వేసుకుంటామని ఇప్పటికే నాగవంశీ క్లారిటీ ఇచ్చాడు. నిన్న అమేజాన్ తో ముంబైలో వీరమల్లు టీమ్ చర్చలు జరిపింది. ఆల్రెడీ అమేజాన్ వాళ్లు అడ్వాన్స్ ఇవ్వడంతో.. ఇప్పుడు త్వరగా రిలీజ్ చేయాలని ఒత్తిడి పెడుతున్నారంట.




# 'ది ఢిల్లీ ఫైల్స్' టైటిల్ బెంగాల్ ఫైల్స్‌గా మార్పు

**టాకీస్:** 'ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి సంచలన చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి చిత్రం 'ది ఢిల్లీ ఫైల్స్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను 'ది కశ్మీర్ ఫైల్స్' నిర్మించిన టాలీవుడ్ బ్యానర్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ చిత్ర టైటిల్‌పై సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ సినిమా టైటిల్‌ను 'ది ఢిల్లీ ఫైల్స్ నుంచి 'ది బెంగాల్ ఫైల్స్: రైట్ టు-లైఫ్ అని మార్చినట్లుగా ప్రకటించాడు. దీంతో ఈ చిత్రం ది బెంగాల్ ఫైల్స్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా టీజర్‌ను జూన్ 12న విడుదల చేయనున్నారు. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు.

# 'కన్నప్ప' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్!

**టాకీస్:** మంచు ఫ్యామిలీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కన్నప్ప చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్ అప్డేట్‌ను పంచుకున్నారు. కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చారిత్రక చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.






ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్రతారలు కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రాబోతున్న చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా ట్రైలర్‌ను శుక్రవారం(జూన్ 13) రోజున విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది.

# మాల్దీవుల బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా

టాకీస్: పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు- తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా -కై-ఫ్ గ్లోబల్ అంబాసడర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు.




# మళ్లీ తెరపైకి షారుఖ్ ఖాన్ సుకుమార్ కాంబో!

**టాకీస్:** బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ మరోసారి సౌత్ దర్శకుడితో చేతులు కలపబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. పుష్ప ది రూల్ సినిమాతో నేషన్ వైడ్ బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు సుకుమార్ తో కలిసి షారుఖ్ తన తదుపరి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు చాలా రోజులుగా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ కాంబో మళ్లీ తెరపైకి రాగా.. ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మించబోతుందని వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా బడ్జెట్ దాదాపు





రూ.200 నుంచి రూ.300 కోట్లు ఉండబోతుందని సమాచారం. అలాగే ఈ సినిమాకు షారుఖ్‌తో పాటు సుకుమార్ భారీ పారితోషికం ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది.

అయితే, ఇప్పటివరకు ఈ మెగా ప్రాజెక్ట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. షారుఖ్ ఖాన్ ప్రస్తుతం తన 'కింగ్', 'పఠాన్ 2' వంటి ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. సుకుమార్ కూడా ప్రస్తుతం తన తర్వాతి ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# ఉస్తాద్ భగత్ సింగ్ యాక్షన్‌కి టైమ్ ఫిక్స్

**టాకీస్:** రాజకీయాల వలన కొన్నాళ్ల పాటు సినిమా షూటింగ్స్‌కి దూరంగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు తను కమిటైన ప్రాజెక్ట్‌లు పూర్తి చేసే పనిలో పడ్డారు. దాదాపు రెండేళ్ల క్రితం మేనల్లుడు సాయి దుర్గా తేజ్ తో కలిసి 'బ్రో అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన పవన్ ఆ తర్వాత వెండితెరపై కనిపించింది లేదు. జూలై 28, 2023లో పవన్ చివరి చిత్రం విడుదల అయ్యింది . అయితే 'హరి హర వీరమల్లు'తో ఈ నెల 12న థియేటర్లలోకి వస్తారని పవన్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. కాని పలు కారణాల వలన ఈమూవీ మళ్లీ పోస్ట్ పోన్ అయింది. మరోవైపు తాను కమిట్ అయిన ఓజీ చిత్ర షూటింగ్ కూడా పూర్తి చేసినట్టు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల




చేయనున్నారు.

పవన్ కమిటైన మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. గబ్బర్ సింగ్ చిత్రం తర్వాత హరీష్, పవన్ కాంబోలో రూపొందుతున్న ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకి దీనిపై హరీష్ శంకర్ క్లారిటీ ఇచ్చారు. ఇటీవల కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న హరీశ్ శంకర్ జూన్ రెండవ వారంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు కోసం తిరుమలకు వచ్చామని హరీష్ తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు.

# ఓటీటీలోకి నవీన్ చంద్ర ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవన్'

**టాకీస్:** రొటీన్ సినిమాలకు భిన్నంగా నటిస్తూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటులతో నవీన్ చంద్ర ఒకడు. అయితే ఆయన ప్రధాన పాత్రల్లో నటించి ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం ఎలెవన్. ఈ చిత్రానికి లోకేశ్ అజిల్స్ దర్శకత్వం వహించగా.. ఎ.ఆర్.ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. రియా హరి, శశాంక్, అభిరామి, దిలీపన్, ఆడుకాలం నరేన్, రవి వర్మ, కిరీటి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. గత నెల 16న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఈ చిత్రం జూన్ 13 నుంచి



స్ట్రీమింగ్ కాబోతుంది.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. విశాఖపట్నంలో వరుస హత్యలు సంచలనం సృష్టిస్తాయి. బాధితులను గుర్తించలేని స్థితిలో పోలీసులు తలలు పట్టుకుంటారు. ఈ కేసును డీల్ చేస్తున్న పోలీస్ ఆఫీసర్ శశాంక్‌కు ప్రమాదం జరగడంతో, ఏసీపీ అరవింద్ (నవీన్ చంద్ర) రంగంలోకి దిగుతాడు. అరవింద్ రంగంలోకి దిగిన కూడా హత్యలు ఆగవు. హంతకుడితో పాటు హత్యకు గురైన వారి ఆనవాళ్లు కూడా దొరకవు. సవాలుగా మారిన ఈ కేసులో చివరకు ఓ చిన్న ఆధారం లభిస్తుంది. అయితే ఈ క్లూతో నేరస్థుడిని అరవింద్ ఎలా పట్టుకున్నాడు. నేరస్థుడికి ఎవరు సహాయం చేశారు? అసలు ఆ సైకో ఎందుకు హత్యలు చేస్తున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.